ప్రజలను దగా చేసిన చంద్రబాబు

విద్యుత్ చార్జీల బాదుడుపై వైఎస్సార్ సీపీ పోరుబాట

- దుర్మార్గ పరిపాలన సాగిస్తున్న చంద్రబాబు
- ఆరు నెలల్లోనే ప్రజల పై రూ. 15 వేల కోట్లు విద్యుత్ చార్జీల భారం
- సామాన్యుల నడ్డివిరిచే విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలి
- జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ చిట్టా విజయభాస్కరరెడ్డి
- సత్తెనపల్లిలో నిరసన ర్యాలీ, విద్యుత్ సిబ్బందికి వినతిపత్రం



సత్తెనపల్లిలో నిరసన ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు చిట్టా విజయభాస్కర రెడ్డి, డాక్టర్ గజ్జల నాగభూషణ్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు

సత్తెనపల్లి: రాష్ట్రంలో మునుపెన్నడూ లేనివిధంగా నిత్యావసర సరుకులతో పాటు నిత్యం ఉపయోగించే విద్యుత్ చార్జీలను పెంచి ముఖ్యమంత్రి చంద్రబాబు దుర్మార్గ పాలన సాగిస్తున్నాడని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్, వైఎస్సార్ సీపీ నేత చిట్టా విజయభాస్కరరెడ్డి అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు కరెంటు చార్జీల బాదుడుపై పార్టీ ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమాన్ని శుక్రవారం సత్తెనపల్లిలో నిర్వహించారు. తొలుత పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయం నుంచి ప్రదర్శనగా గుంటూరు రోడ్డులోని విద్యుత్ కార్యాలయానికి చేరుకొని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా చిట్టా విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచబోమని హామీ ఇచ్చిన చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ప్రజలపై రూ. 15,485.36 కోట్ల మేర భారాన్ని మోపి నిలువునా మోసం చేశారన్నారు. విద్యుత్ ట్రూ అప్ చార్జీల పేరుతో రూ. 6 వేల కోట్లు, సర్‌చార్జీల పేరుతో రూ.9 వేల కోట్లు ప్రజలపై పన్ను భారం మోపారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తానని చెప్పి తీరా గెలిచాక ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. సామాన్యుల నడ్డి విరిచే విధంగా కరెంటు చార్జీలు పెంచారన్నారు. సూపర్ సిక్స్ అమలు చేయాలంటే చంద్రబాబుకు భయం పట్టుకుందన్నారు.సామాన్యుల పక్షాన వైఎస్సార్ సీపీ నిత్యం పోరాడుతుందన్నారు. సామాన్యుల నడ్డివిరిచే పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గజ్జల నాగభూషణ్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజలకు విద్యుత్ బిల్లులు భారం కాకూడదనే లక్ష్యంతో ఇంధనం, విద్యుత్ కొనుగోలు చార్జీలను విధించకుండా బిల్లులు జారీ చేసేదన్నారు. కానీ గత ప్రభుత్వంపై పెద్ద ఎత్తున నిందల మోపిన చంద్రబాబు ఇప్పుడు ప్రజలపై ఆరు నెలల్లోనే రూ. 6 వేల కోట్ల భారం మోపారని, మరో రూ. 9 వేల కోట్లు భారం మోపేందుకు సిద్ధమయ్యారన్నారు. సంపద సృష్టి అంటే సామాన్య ప్రజలపై భారం మోపటమేనా అని ప్రశ్నించారు. పార్టీ సత్తెనపల్లి మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజలపై భారం పడకుండా పరిపాలన సాగిస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆరు నెలల్లోనే సామాన్యులను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. తక్షణమే గృహ వినియోగదారులపై మోపిన రూ 15,485.36 కోట్ల విద్యుత్ చార్జీల బాదుడును వెనక్కి తీసుకోవాలని, ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా చార్జీల పెంపును నిలిపివేయాలని, ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు కొనసాగించాలని లేకుంటే చంద్రబాబు తక్షణమే రాజీనామా చేయాలని నినాదాలు ఇస్తూ ప్రదర్శనగా గుంటూరు రోడ్డులోని విద్యుత్ కార్యాలయానికి చేరుకున్నారు. కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావునాయక్, ఏఎంసీ మాజీ చైర్మన్ పెండెం బాబురావు, నాయకులు షేక్ మౌలాలి, వేపూరి శ్రీనివాసరావు, కళ్లం విజయ భాస్కర్ రెడ్డి, అచ్యుత శివప్రసాద్, గుజ్జర్లపూడి సతీష్, పెద్దింటి వెంకటేశ్వర్లు, గద్దం వెంకటేశ్వర్లు, మర్రి సుబ్బారెడ్డి, తేలుకుట్ల.చంద్రమౌళి, చిలుకా జైపాల్, ప్రవీణ్‌రెడ్డి, తుమ్మల వెంకటేశ్వరరావు, గుజ్జర్ల పూడి కృపావరం, రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, ఇందూరి నరసింహారెడ్డి, గుంటూరు నతానియేలు, నందిగం యల్లమంద, గంటా ఏసుబాబు, వల్లెం నరసింహారావు, యాసారపు బాబు, గొల్లపల్లి రాము, గొల్లపల్లి నాగేశ్వరరావు, దేశిబాబు, నల్లబోతు శివనారాయణ, భట్లూరు కోటేశ్వరరావు, బొడ్డు నాగేశ్వరరావు, ఉల్లంగుల ప్రసాద్‌బాబు, ఇంటూరి వీర య్య, మందడపు సాయి, నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



విద్యుత్ శాఖ సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న నేతలు

'బాదుడు'పై నిరసన గళం

- విద్యుత్ చార్జీల పెంపుపై కదం తొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- ప్రజలపై రూ.వేలకోట్ల విద్యుత్ చార్జీల భారం మోపిన కూటమి సర్కారు
- చార్జీలు తగ్గించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తాం
- పెదకూరపాడు కాలచక్రరోడ్డు వద్ద వైఎస్సార్ సీపీ శ్రేణుల నిరసన
- స్వచ్ఛందంగా మద్దతు పలికిన ప్రజలు
- నిరసన ర్యాలీని అడ్డుకున్న పోలీసులు



పెదకూరపాడులో విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా ఆందోళన చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెదకూరపాడు: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని మరిచి ప్రజలపై విద్యుత్ బిల్లుల భారం మోపిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో విద్యుత్ బాదుడుపై వైఎస్సార్ సీపీ పోరుబాట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మండలంలోని నలుమూలల నుంచి పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు. తొలుత పెదకూరపాడులోని సినిమా హాల్ సెంటర్ వద్ద నుంచి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కాలచక్ర రహదారిపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యుత్ కార్యాలయంలోని విద్యుత్ ఏఈ దాసరి రామకృష్ణకు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నేతలు మాట్లాడుతూ తక్షణమే గృహ వినియోగదారులపై మోపిన రూ.15,485.36 కోట్ల చార్జీల బాదుడును వెనక్కి తీసుకోవాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చార్జీల పెంపు నిలిపేయాలని, ఎస్సీ, ఎస్టీ లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కొనసాగించాలన్నారు. ఇప్పటికే ప్రజలకు ప్రతి నెల రూ.200 నుంచి 300 వరకు భారం పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, పద్మ వెంకటేశ్వర రెడ్డి, కోటయ్య, గంగసాని నరసింహారావు, జెడ్పీటీసీలు కంకణాల స్వర్ణకుమారి, వెంటకరెడ్డి, జిల్లా పరిషత్ కో-ఆప్షన్ మెంబర్ షేక్ హస్నీ, మండల పార్టీ అధ్యక్షులు షేక్ మస్తాన్ షరీఫ్, భవిరిశెట్టి హనుమంతురావు, చింతారెడ్డి సాయిరెడ్డి, రామచంద్రయ్య, అప్పారావు, ప్రసాద్‌రెడ్డి, నాయకులు నిమ్మా విజయసాగర్‌బాబు, పచ్చల ఆనందరావు, కొండవీటి కోటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, బచ్చుహనుమంతురావు, అప్పిరెడ్డి, కొట్టి రెడ్డి, సాయిరెడ్డి, బద్దూరి చంద్రరెడ్డి, బత్తుల కోటేశ్వరరావు, నల్లపాటి యోహాన్, కల్లి శ్రీనివాసరెడ్డి, యండ్లూరి నాగమల్లేశ్వరరావు, షేక్ యాసిన్, హసన్ ఆలీ, వజ్రాల శ్రీనివాసరెడ్డి, భయంకర్ సుభాని, గుత్తికొండ శ్రీనివాసరెడ్డి, హనిమిరెడ్డి, ఎంపీటీసీ షేక్ హసన్ ఆలీ, మైనేని నరేంద్ర, సాంబశివరావు, గుడిపూడి అశోక్, అచ్చుత్‌రావు, చిర్రా దామోధర్‌రెడ్డి, కాంతరావు, చాట్ల ఫ్రాన్సిస్, ఇనుముక్కల సుధాకర్, చిట్టిబాబు పాల్గొన్నారు.



విద్యుత్ ఏఈ రామకృష్ణకు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



నిరసనను అడ్డుకుంటున్న పోలీసులు

పోలీసుల అత్యుత్సాహం..

కాలచక్ర రోడ్డుపై నిరసన ర్యాలీకి సిద్ధమైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. ర్యాలీ నిర్వహించేందుకు అనుమతి లేదని, బ్యానర్ తీసివేయాలని హుకుం జారీ చేశారు. ప్రజల పక్షాన శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే అడ్డుకోవడం సరికాదని పార్టీ నేతలు తెలపగా,ర్యాలీ నిర్వహించేందుకు అనుమతి లేదని, నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. దీంతో బ్యానరు లేకుండా విద్యుత్ కార్యాలయానికి కార్యకర్తలు, నాయకులు నడిచివెళ్లారు.

పెదకూరపాడు తరలిన పార్టీ శ్రేణులు

క్రోసూరు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావుల పిలుపుమేరకు పెదకూరపాడు నియోజకవర్గ కేంద్రంలో శుక్రవారం కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్‌చార్జీలు తక్షణమే తగ్గించాలని కోరుతూ జరిగిన ఆందోళన కార్యక్రమానికి పార్టీ క్రోసూరు మండల నాయకులు తరలివెళ్లారు. అక్కడ పార్టీ నాయకులతో కలిసి విద్యుత్ ఏఈకి వినతి పత్రం అందచేశారు. ఆందోళనకు తరలిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు వెలది అప్పారావు, ఎంపీపీ పి.కోటయ్య, వైస్ ఎంపీపీ విప్పల వెంకట్రామిరెడ్డి, అనుముల కోటిరెడ్డి, పాశం శ్రీనివాసరెడ్డి, చిన్నా, టి.అప్పిరెడ్డి, దుగ్గి ఏడుకొండలు, కేశవరెడ్డి, బాజి, కరిముల్లా తదితరులున్నారు.

క్లుప్తంగా

వైభవంగా శ్రీవారికి ధనుర్మాస పూజలు



సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీవారి ఆలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో వైభవంగా పూజలు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని వడ్డవల్లి రామాలయం దేవి భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీవారికి తులసి అలంకారం చేపట్టారు. రైల్వే స్టేషన్ రోడ్ లోని అలివేలుమంగా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీవారికి పద్మ పీఠ అలంకారం చేసి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యతోనే ఉన్నత భవిష్యత్



పెదకూరపాడు: విద్యతోనే ఉన్నత భవిష్యత్ ఉంటుందని చార్టెడ్ అకౌంటెంట్ గడ్డిపాటి సుధాకర్ అన్నారు. జనచైతన్య సమితి ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐలు రాయపూడి వెంకటేశ్వర్లు, రాయపూడి రామకృష్ణ ఆర్థిక సహాయంతో రాయపూడి సెల్ఫ్ ఫౌండేషన్ సహకారంతో పెదకూరపాడులోని జెడ్పీ పాఠశాలలోని 78 మంది పదో తరగతి విద్యార్థులకు పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ విదేశాల్లో స్థిరపడి జన్మభూమి మీద ప్రేమతో ఇక్కడ పేద విద్యార్థులకు చేయూతగా నిలుస్తున్న రాయపూడి వెంకటేశ్వర్లు, రామకృష్ణలను అభినందనీయులన్నారు. హెచ్‌ఎం రమణ, ఫౌండేషన్ నిర్వహకులు రాయపూడి సాంబశివరావు, చిన్నమక్కెన మాజీ సర్పంచ్ వెలగా అయేశ్వర రావు, జనచైతన్య సమితి ప్రతినిధి వెలితోటి అనిల్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదవతరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం పంపిణీ చేశారు. యూటీఎఫ్ ముప్పాళ్ళ మండల శాఖ ఆధ్వర్యంలో పాఠశాలలోని 33 మంది పదవతరగతి విద్యార్థులకు జెడ్పీటీసీ సభ్యురాలు శిరిగిరి చంద్రకళ చేతుల మీదుగా మెటీరియల్ అందించారు. పదవతరగతిలో మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులనుద్దేశించి చెప్పారు. హెచ్‌ఎం జి.మిరియమ్మ, యూటీఎఫ్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ షరీఫ్ పాషా, జిల్లా కౌన్సిలర్ చిందుకూరి నాగేశ్వరరావు, మండల యూటీఎఫ్ నాయకుడు ముప్పా సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థిక సంస్కరణల సారథి మన్మోహన్‌సింగ్



వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సత్తెనపల్లి: భారతదేశానికి సమర్థవంతమైన పరిపాలన అందించిన మహోన్నత వ్యక్తి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు చిట్టా విజయభాస్కరరెడ్డి అన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిపై సంతాపం వ్యక్తం చేస్తూ పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్తు కోటేశ్వరరావునాయక్, పార్టీ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమ రావు, పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, నాయకులు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, అచ్యుత శివప్రసాద్, చిలుకా జైపాల్, మర్రి సుబ్బారెడ్డి, తేలుకుట్ల చంద్రమౌళి, నందిగం యల్లమంద, గుజ్జర్లపూడి కృపావరం, రెండెద్దుల వెంకటేశ్వర రెడ్డి, ఇందూరి నరసింహారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు,తదితరులు ఉన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చుక్కా చంద్రపాల్, పట్టణ అధ్యక్షుడు దాసరి జ్ఞానరాజ్‌పాల్ తదితరులు మాజీ పీఎం మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు.

అచ్చంపేటలో...

అచ్చంపేట: భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ రాజనీతిజ్ఞుడని, దేశం గర్వించదగిన వ్యక్తి అని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. వైఎస్సార్ సీపీ మండల కార్యాలయంలో శుక్రవారం దివంగత, మాజీ పీఎం మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ సీహెచ్‌ఎస్సార్కే సాయిరెడ్డి, సర్పంచ్ కంబావీర బాబు, మైనార్టీ సెల్ నాయకుడు షేక్ కమల్ సైదా, కో-ఆప్షన్ సభ్యుడు షేక్ సుభాని, అచ్చంపేట మండల కన్వీనర్ షేక్ సమరం తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేని వెంచర్లను తొలగిస్తాం



అక్రమ వెంచర్లను పరిశీలిస్తున్న తహసీల్దార్

రాజుపాలెం: అనుమతులు లేకుండా వెంచర్‌లు ఏర్పాటు చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని తహసీల్దార్ దుర్గేష్‌రావు తెలిపారు. మండలంలోని అనుపాలెం, చౌటపాపాయపాలెం పంచాయతీల పరిధిలో అనుమతులు లేకుండా అక్రమంగా లేఅవుట్లు ఏర్పాటు చేస్తున్న భూమిని తహసీల్దారు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ భూమిని వెంచర్‌లుగా ఏర్పాటు చేయదలచినవారు ముందుగా రెవెన్యూ అనుమతులు తీసుకోవాలని, తరువాత పంచాయతీ అనుమతులు పొందిన తరువాతనే ప్లాట్స్ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ప్లాట్స్ కూడా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏర్పాటు చేయాలని సూచించారు. విచారణ చేసి అనుమతులు లేని వెంచర్లను వెంటనే తొలగిస్తామని భూ యజమానులను హెచ్చరించారు. అక్కడ ప్లాట్లు కొన్న యజమానులకు ఇంటి నిర్మాణం కోసం పంచాయతీ అనుమతి ఇవ్వదని, అనుమతులు లేకుండా ప్లాట్లను రిజిస్ట్రేషన్ కూడా చేయరని చెప్పారు.

ఘనంగా సీపీఐ శతవసంతాల వేడుకలు



రొంపిచర్ల: స్థానిక చెరువుకట్ట సెంటర్లో శుక్రవారం సీపీఐ శతవసంతాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జెండాను ఎగురవేశారు. సీపీఐ జిందాబాద్, మార్కినిజం-లెనినిజం జిందాబాద్ అంటూ సీపీఐ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యనారాయణరాజు మాట్లాడుతూ ఈ దేశంలోభారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 99 సంవత్సరములు పూర్తి చేసుకుని 100 సంవత్సరములో అడుగుపెడుతుందని అన్నారు. అనంతరం మండలంలో విప్పర్లపల్లి గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకులు కొర్నెపాటి ఏసోబును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా సీనియర్ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సరికొండ తిమ్మరాజు, రైతు సంఘం నాయకులు చిట్యాల శ్రీనివాసరెడ్డి, సీపీఐ మండల నాయకులు ముప్పూరి మధుసూదనరావు, పిడెం హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

చేతి వృత్తులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ

పిడుగురాళ్ల: చేతి వృత్తుల వారికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి, సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ శుక్రవారం తన కార్యాలయంలో తెలిపారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, మెప్మా పిడుగురాళ్ల సంఘం పరిధిలోని ప్లంబర్స్, కార్పెంటర్లు, ఎలక్ట్రీషన్లు, ఏసీ, గీజర్, టీవీ మెకానిక్‌లతో పాటు బ్యూటీషన్ పలు సేవలు అందించే వారందరికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఎన్ఎస్‌డీసీ ద్వారా అందించి సర్టిఫికెట్లు, హోం ట్రైయాంగిల్ ప్లాట్‌ఫాం ద్వారా జీవనోపాధి కల్పించబడుతుందని తెలిపారు. ఆసక్తి గలిగిన అభ్యర్థులు ఈ నెల 30వ తేదీలోపు పట్టణంలోని గాంధీ నగర్ సచివాలయం సమీపంలో ఉన్న మెప్మా కార్యాలయంలో వివరాలను నమోదు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ పేర్కొన్నారు. రేషన్, ఆధార్, బ్యాంక్ పాస్ పుస్తకం, పాన్ కార్డు జిరాక్స్‌లతో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 83098 36728, 98481 08768 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

కామ్రేడ్ ముస్తఫాకు ఘననివాళి

క్రోసూరు: క్రమశిక్షణ కలిగిన కమ్యూనిస్టు ముస్తఫా అని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.విజయకుమార్ అన్నారు. శుక్రవారం క్రోసూరు సీపీఎం సీనియర్ నాయకుడు కామ్రేడ్ షేక్ గండ్లూరు ముస్తఫా సంతాప సభ ఆమంచి విజ్ఞాన కేంద్రంలో సీనియర్ నాయకులు ఆంజనేయులు అధ్యక్షతన జరిగింది. తొలుత కామ్రేడ్ ముస్తఫా చిత్రపటానికి జిల్లా కార్యదర్శి జి.విజయకుమార్ పూలమాలవేసి నివాళులర్పించారు. నాయకులు రావెళ్ల వెంకటేశ్వర్లు, తిమ్మిసెట్టి హనుమంతరావు, ఏపూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహానికి గ్రైండర్ బహూకరణ

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహానికి తెలుగుదేశం నాయకుడు వడ్లమూడి వెంకట కిషోర్ రూ.20 వేల రూపాయల విలువ చేసే గ్రైండర్‌ను శుక్రవారం బహూకరించారు. విద్యార్థినులకు భోజనం తయారీలో నాణ్యమైన భోజనం అందించేందుకు గ్రైండర్ ఉపకరిస్తుందని బహూకరించినట్లు ఆయన తెలిపారు. కిషోర్‌కు పాఠశాల ప్రిన్సిపాల్ బాలశౌరీలు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు అభినందనలు తెలిపారు.

అపరాధ రుసుం మినహాయింపు పొందండి

నరసరావుపేట: 2024-25 ఆర్థిక సంవత్సర సంబంధించి అర్థసంవత్సరంకు చెందిన ఆస్తి, ఖాళీ స్థలాలు, నీటి కుళాయిల పన్నులు ఈనెల 31లోగా చెల్లించి అపరాధరుసుం నుంచి మినహాయింపు పొందాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు శుక్రవారం ఒక ప్రకటనలో పట్టణ ప్రజలకు సూచించారు. ఇంకా నాలుగురోజులే సమయం ఉన్నందున పురపాలకసంఘంలోని ట్రెజరీ, సచివాలయ పరిపాలన కార్యదర్శి లేక ఆన్‌లైన్‌లో చెల్లించి పురపాలక అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. పన్నులు చెల్లించేందుకు వచ్చే ఆదివారం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6.30వరకు పురపాలక సంఘంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

దాచేపల్లి : నడికుడి వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు శుక్రవారం గాయపడ్డారు. వాడపల్లికి చెందిన హరిగోపాల్‌తో పాటుగా మరొక వ్యక్తి ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. ఎదురుగా వస్తున్న వాహనం అతివేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో హరిగోపాల్‌తో పాటుగా మరొకరు గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటలోని ప్రయివేట్ హస్పిటల్‌కి తరలించారు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జాబ్‌మేళాలో పది మంది ఎంపిక



చిలకలూరిపేట: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని రాగన్నపాలెం కమ్యూనిటీ హాలులో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాకు 16 మంది నిరుద్యోగులు హాజరుకాగా అందులో 10 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ తమ్మాజీరావు, సీడాప్ ప్లేస్‌మెంట్ అధికారి నాగుల్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ జె సురేష్, ఆయా కంపెనీల హెచ్‌ఆర్‌లు పాల్గొన్నారు.

రామాపురంలో రెవెన్యూ సదస్సు



రెవెన్యూ సదస్సులో దరఖాస్తు అందిస్తున్న రైతు

పెదకూరపాడు: మండలంలోని రామాపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మొత్తం ఐదు దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ మీసాల దానియేలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి దరఖాస్తుకు పరిష్కార మార్గం చూపుతున్నామన్నారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన సదస్సులో పలు కారణాలతో దరఖాస్తులు అందించలేకపోయిన వారు తహసీల్దార్ కార్యాలయంలో అందించవచ్చన్నారు. మండల సర్వేయర్ రాజు, వీఆర్వో జ్యోతి పాల్గొన్నారు.

ఇరుకుపాలెంలో...

ఇరుకుపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని ఇరుకుపాలెం గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు జరిగింది. సదస్సులో తహసీల్దార్ ఎం.భవానిశంకర్ పాల్గొని అర్జీలు స్వీకరించారు. సర్వేకు సంబంధించి, పెన్షన్‌లు కోసం, రేషన్‌కార్డుల కోసం అన్నీ కలిపి 39 అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు. డీటీ సీహెచ్ లక్ష్మీప్రసాదు, మండల సర్వేయర్ టి.సుధాకర్, మాజీ సర్పంచ్ బత్తుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అబ్బూరులో...

సత్తెనపల్లి: భూములకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా అర్జీలు ఇచ్చి పరిష్కరించుకోవాలని సత్తెనపల్లి తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి చెప్పారు. సత్తెనపల్లి మండలం అబ్బూరు గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో తహసీల్దార్ చక్రవర్తి మాట్లాడుతూ దీర్ఘకాలంగా పరిష్కారం కాని భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు ఈ సదస్సులు దోహదపడతాయన్నారు. గ్రామంలో పెన్షన్ కోసం 47, రైస్ కార్డులకు 46, రెవెన్యూ సమస్యల కోసం 6, సర్వే నిమిత్తం 2, మొత్తం 101 అర్జీలు వచ్చాయన్నారు. సర్పంచ్ గోలదారి అన్నపూర్ణమ్మ, మండల సర్వేయర్ వై.శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బోసు బాబు, గ్రామ రెవెన్యూ అధికారి డి.మరియదాసు, గ్రామ సర్వేయర్ అనూష, దేవదాయ శాఖ అధికారి రామకోటిరెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో...

పీసపాడు(క్రోసూరు): మండలంలోని పీసపాడు, పారుపల్లి గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులకు 8 అర్జీలు వచ్చినట్లు డిప్యూటీ తహసీల్దార్ జింకా శ్రీనివాసరావు తెలిపారు. తమ భూములు ఆన్‌లైన్ చేయాలని అర్జీలు అందచేసినట్లు తెలిపారు. వీఆర్వోలు రామచంద్రరావు, కార్యదర్శి రాజ్యలక్ష్మి, మండల సర్వేయర్ శ్రీధర్, రైతులు పాల్గొన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోండి

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజరు శివకృష్ణ



శావల్యాపురం: స్వయం సహాయక మహిళా సభ్యులు బ్యాంకు రుణాలు సద్వినియోగం చేసుకోవాలని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజరు వలేటి శివకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక బ్రాంచ్ కార్యాలయంలో మహిళా గ్రూపుల్లోని సభ్యులకు రుణాలు మంజూరు చేశారు. ఈసందర్భంగా బ్రాంచ్ మేనేజరు శివకృష్ణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా సభ్యులు జీవనోపాదులు పెంపుదలకు ఈరుణాలు ఎంత గానో దోహదపడుతుందన్నారు. రుణాలు సకాలంలో చెల్లించి బ్యాంకు పురోగాభివృద్ధిలో మహిళా సభ్యులు బాధ్యత వహించాలన్నారు. ఒక్కో గ్రూపుకు రూ. 15 లక్షల చొప్పున 20 గ్రూపులకు రూ. 3 కోట్లు రుణాలను అందజేసినట్లు తెలిపారు. అలాగే వ్యవసాయ అనుబంధ రుణాలను రూ. 30 కోట్లు రైతులకు ఇచ్చినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో యానిమేటరు జి.రామలక్ష్మి, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా 'మద్దుల'



చిలకలూరిపేట: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పట్టణానికి చెందిన మద్దుల వెంకట కోటయ్య యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య హైదరాబాద్‌లో నియామక పత్రం అందజేశారు. మద్దుల వెంకటకోటయ్య యాదవ్ కరోనా సమయంలో సొంత నిధులతో వితరణ కార్యక్రమాలు నిర్వహించారని పలువురు బీసీ సంఘ నాయకులు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆయనకు సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించటం పట్ల అభినందనలు తెలిపారు. ఆయన నియామకం పట్ల అభినందనలు తెలిపిన వారిలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు, రాష్ట్ర ఇన్‌చార్జి యలగాల నూకాలమ్మ తదితరులు ఉన్నారు.